క్లుప్తంగా

ఆలయ నిర్మాణానికి భూమిపూజ



భూమిపూజలో పాల్గొన్న సర్పంచ్ మంజుల దంపతులు

మెళియాపుట్టి: మండలంలోని రట్టిణి గ్రామంలో అమ్మవారి ఆలయ నిర్మాణానికి సర్పంచ్ మంజుల సాములో శనివారం భూమిపూజనిర్వహించారు. ఇటీవల ఎండోమెంట్ అధికారులు గ్రామాన్ని సందర్శించి అమ్మవారి ఆలయ నిర్మాణానికి రూ.10 లక్షలు మంజూరు చేశారని తెలిపారు. గ్రామస్తులు, మహిళలు కలిసి భూమిపూజ చేపట్టారు. ఆలయ నిర్మాణానికి నిధులు మంజూరు చేసిన ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.

రూ.4లక్షలతో ఆలయ ప్రహరీ నిర్మాణం



ప్రహరీ నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే రెడ్డి శాంతి

పాతపట్నం: ఉత్తరాంధ్ర ఇలవేల్పు నీలమణి దుర్గ ఆలయ ప్రహరీ నిర్మాణానికి ఎమ్మెల్యే రెడ్డి శాంతి శనివారం భూమిపూజ చేశారు. ఎమ్మెల్యే తన సొంత నిధులు రూ.4లక్షలతో ప్రహరీ నిర్మాణం చేపట్టనున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆలయ అభివృద్ధికి దాతలు సహకరించాలని కోరారు. ఆలయ ఈఓ టి.వాసుదేవరావు, సచివాలయ మండల కన్వీనర్ వై.సూర్యం, కార్యదర్శి రాము, నాయకులు వరదరాజులు, ప్రవీణ్, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

రూ.60 లక్షలతో గిరిజనులకు ప్రత్యేక భవనం



భూమిపూజ చేస్తున్న జెడ్పీటీసీ సభ్యుడు గూడ ఎండయ్య

మెళియాపుట్టి: గిరిజనుల అవసరాలు తీర్చడానికి ఐటీడీఏ ద్వారా రూ.60 లక్షలతో గిరిజనులకు ప్రత్యేక భవనం మంజూరు చేయడం సంతోషకరమని జెడ్పీటీసీ సభ్యుడు గూడ ఎండయ్య తెలిపారు. కొత్తూరు పంచాయతీ పరిధిలోని పాత్రలోవ గిరిజన గ్రామంలో భవన నిర్మాణానికి శనివారం ఉదయం భూమిపూజ చేశారు. గిజనులు పండించిన పంటలు నిల్వ, వారి అవసరాలకు సమావేశాలు నిర్వహించుకోవడానికి, మరిన్ని బహుళ ప్రయోజనాలకు ఉపయోగించడానికి ఈ భవనం మంజూరు చేశారని తెలిపారు. గిరిజనుల ఆర్థిక పురోభివృద్ధి పట్ల ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉందన్నారు. బాలకృష్ణ, పలువురు గిరిజనులు పాల్గొన్నారు.

రూ.1.50 లక్షలతో భోజనాల షెడ్ నిర్మాణం



షెడ్ నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న ఆలయ ఈఓ వాసుదేవరావు

పాతపట్నం: మండల కేంద్రంలోని నీలమణి దుర్గ అమ్మవారి ఆలయం ఎదుట ఉన్న మామిడితోటలో టెక్కలికి చెందిన గ్యాస్ ఏజెన్సీ యాజమాని జి.విశ్వేశ్వరరావు తన సొంత నిధులు రూ.1.50 లక్షలతో భక్తులు భోజనాలు చేయడానికి రేకుల షెడ్ నిర్మాణం చేపట్టేందుకు ముందుకు వచ్చారని ఆలయ ఈవో టి.వాసుదేవరావు అన్నారు. షెడ్ నిర్మాణానికి ఈఓ శనివారం భూమిపూజ నిర్వహించారు. షెడ్ నిర్మాణం పూర్తియితే భక్తులకు అనుకూలంగా ఉంటుందన్నారు.ఆలయ గుమస్తా సుదర్శనరావు, భక్తులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

టికెట్ కేటాయింపుపై హర్షం



ఎమ్మెల్యే రెడ్డి శాంతికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న నాయకులు

మెళియాపుట్టి: పాతపట్నం వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా ఎమ్మెల్యే రెడ్డి శాంతిని ప్రకటించడంతో పార్టీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. మెళియాపుట్టి మండల అధ్యక్షుడు పల్లి యోగి, పీఏసీఎస్ చైర్మన్ ఉర్లాన బాలరాజు, పార్టీ నాయకులు పాతపట్నంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో శనివారం రెడ్డి శాంతిని కలిసి అభినందనలు తెలిపారు. సీఎం జగన్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో మండల కోఆప్షన్ సభ్యుడు భాస్కర దాస్, నాయకులు జయమునిరావు, ఈశ్వరరావు, ప్రసాదరావు, రామరాజు తదితరులు ఉన్నారు.

సంక్షేమానికి పట్టం కట్టండి

- ఎన్నికల ప్రచారంలో స్పీకర్ తమ్మినేని సీతారాం



ఆమదాలవలస రూరల్: రామచంద్రాపురంలో ఎన్నికల ప్రచారం చేస్తున్న స్పీకర్ తమ్మినేని సీతారాం

ఆమదాలవలస రూరల్: ప్రజా సంక్షేమం కోసం కృషి చేసిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరలా ముఖ్యమంత్రిని చేసేందుకు ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. మండలంలోని రామచంద్రాపురం గ్రామంలో మొదటిసారిగా శనివారం ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి సంక్షేమం, అభివృద్ధి చేసిన వైఎస్సార్‌సీపీని ఆదరించాలని కోరారు. నియోజకవర్గాన్ని అభివృద్ధి బాటలో నడిపించేందుకు, ఇంటికే సంక్షేమం తీసుకువచ్చిన జగనన్న కోసం తమ అమూల్యమైన ఓటును వేసి గెలిపించాలని కోరారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను శతశాతం అమలు చేసి, అవినీతికి ఆస్కారం లేకుండా పరిపాలన అందించిన జగనన్నను మనందరం గెలిపించుకోవాలన్నారు. ఎమ్మెల్యే అభ్యర్థిగా మరోసారి జగనన్న అవకాశం కల్పించారన్నారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేకాహ్వానితుడు తమ్మినేని శ్రీరామ్మూర్తి, జెడ్పీటీసీ సభ్యుడు బెండి గోవిందరావు, పీఏసీఎస్ అధ్యక్షుడు గురుగుబెల్లి శ్రీనివాసరావు, డైరెక్టర్ తిర్లంగి రామారావు, సర్పంచ్ చల్లా ఉష, ఎంపీటీసీ కొల్లి యమున, మాజీ ఎంపీటీసీ కొల్లి శ్రీనివాసరావు, రౌతు శ్రీనివాసరావు, పార్టీ నాయకులు తమ్మినేని వేణు, గురుగుబెల్లి చంద్రయ్య, గొంటి కృష్ణ, చల్లా సింహాచలం, కూటికుప్పల సన్యాసిరావు, చేపాన కృష్ణ పాల్గొన్నారు.

పనిచేసే ప్రభుత్వాన్ని ఆదరించండి

పొందూరు: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో పనిచేసే ప్రభుత్వాన్ని, సంక్షేమ పథకాలను అమలు చేసి, అభివృద్ధిని చేసి చూపించిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ఆదరించాలని స్పీకర్ తమ్మినేని సీతారాం కోరారు. పొందూరు పంచాయతీలోని లక్ష్మీపేట, జోగన్నపేట గ్రామాల్లో శనివారం ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఆమదాలవలస ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీచేస్తున్న తనకు అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఆమదాలవలస నియోజకవర్గాన్ని ఈ ఐదేళ్లలో ఎంతో అభివృద్ధి చేశానన్నారు. తొలిత దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి, బీఆర్ అంబేడ్కర్ విగ్రహాలకు పూలమాల వేశారు. అనంతరం శివాలయంలో పూజలు చేసి ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కిల్లి ఉషారాణి, జెడ్పీటీసీ సభ్యుడు లోలుగు కాంతారావు, పీఏసీఎస్ అధ్యక్షుడు కొంచాడ రమణమూర్తి, పార్టీ మండల అధ్యక్షుడు పప్పల రమేష్‌కుమార్, కిల్లాన సూర్యారావు, బండారు ప్రతాప్‌కుమార్, బాడాన సునీల్ కుమార్, అనకాపల్లి గోవిందరావు, కొంచాడ గిరిబాబు తదితరులు పాల్గొన్నారు.



పొందూరు: లక్ష్మీపేటలో ఎన్నికల ప్రచారాన్ని చేస్తున్న స్పీకర్ తమ్మినేని సీతారాం

విజయఢంకా మోగించాలి

- శ్రీకాకుళం వైఎస్సార్‌సీపీ ఎంపీ అభ్యర్థి పేరాడ తిలక్



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ ఎంపీ అభ్యర్థి తిలక్

సరుబుజ్జిలి: అందరూ కలసికట్టుగా పనిచేసి వైఎస్సార్‌సీపీ విజయఢంకా మోగించాలని శ్రీకాకుళం వైఎస్సార్‌సీపీ ఎంపీ అభ్యర్థి పేరాడ తిలక్ పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో వైఎస్సార్ సీపీ ముఖ్య నేతలు, ప్రజాప్రతినిధులతో శనివారం నిర్వహించిన సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా తిలక్ మాట్లాడుతూ రానున్న ఎన్నికలకు సంబంధించి ప్రతీ కార్యకర్త సైనికుడిగా పనిచేసి ప్రజలకు మరింత చేరువకావాలన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలుచేసిన సంక్షేమ పథకాలు పార్టీకి శ్రీరామరక్షన్నారు. గ్రామాల్లో అందరూ ఏకతాటిపై వ్యవహరించి మరలా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాన్ని అధికారంలోకి తీసుకురావాలని కోరారు. చంద్రబాబు ఎన్నికల సమయంలో అనేక జిమ్మిక్కులకు తెరతీస్తారని, అందరూ అప్రమత్తంగా ఉండి టీడీపీ తప్పుడు ప్రచారాన్ని తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో పార్టీ రాష్ట్ర యువజన విభాగం ప్రధాన కార్యదర్శి తమ్మినేని చిరంజీవి నాగ్, మండల పరిషత్ ప్రత్యేకాహ్వానితుడు కిల్లి వెంకటగోపాలసత్యనారాయణ, జెడ్పీటీసీ సభ్యుడు సురవరపు నాగేశ్వరరావు, వైస్ ఎంపీపీ జి.వి.శివానందమూర్తి, పార్టీ కన్వీనర్ బెవర మల్లేశ్వరరావు, కొత్తకోట పీఏసీఎస్ చైర్మన్ చంద్రశేఖర్, జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు మూడడ్ల రమణ, ఎస్సీ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ ఎడ్ల ఈశ్వరరావు, పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రాజీయే రాజమార్గం



ఆమదాలవలస: కేసులు పరిష్కరిస్తున్న జూనియర్ సివిల్ జడ్జి మణి



నరసన్నపేట: లోక్ అదాలత్ నిర్వహిస్తున్న జడ్జి హరిప్రియ

ఆమదాలవలస: స్థానిక సివిల్ జడ్జి కోర్టులో జూనియర్ సివిల్ జడ్జి ఎస్. మణి ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన నేషనల్ లోక్ అదాలత్‌లో 157 కేసులు పరిష్కరించినట్లు తెలిపారు. క్రిమినల్ కేసులు 150, పీఎల్‌సీలు 03, సివిల్ కేసులు 4 ఉన్నాయి. ఏ కేసులోనైనా రాజీయే రాజమార్గమన్నారు. లోక్ అదాలత్ మెంబర్లు కింతలి త్రినాథరావు, ధనుంజయరావు, న్యాయవాదులు పాల్గొన్నారు.

94 కేసులు పరిష్కారం..

నరసన్నపేట: స్థానిక సివిల్ జడ్జి కోర్టులో శనివారం నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో 94 కేసులు పరిష్కరించారు. మెజిస్ట్రేట్ సి.హరిప్రియ అధ్యక్షతన లోక్ అదాలత్ నిర్వహించారు. న్యాయవాదులు మధుసూదనరావు, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

130 కేసులు రాజీ..

కొత్తూరు: స్థానిక జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో శనివారం జూనియర్ సివిల్ జడ్జి ఎస్.మణి వర్చువల్ విధానంలో జాతీయ లోక్ అదాలత్ నిర్వహించారు. వర్చువల్ విధానంలో క్రిమినల్, ఎక్సైజ్, మనోవర్తితోపాటు పలు రకాల 130 కేసులు రాజీ చేశారు. కేసులు రాజీ ద్వారా అపరాధ రుసుం రూ.1,71,800 వసూలు చేయడం జరిగింది. కొత్తూరు, హిరమండలం, బత్తిలి పోలీస్ స్టేషన్ సిబ్బంది, కక్షదారులు పాల్గొన్నారు.

37 కేసులు ..

పొందూరు: మండల కేంద్రంలోని జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో జూనియర్ సివిల్ జడ్జి, మండల న్యాయసేవాధికార సంస్థ చైర్‌పర్సన్ బి.జ్యోత్స్న అధ్యక్షతన జరిగిన జాతీయ అదాలత్‌లో 137 కేసులను పరిష్కరించారు. బార్ అసోసియేషన్ సభ్యులు, పోలీసు అధికారులు పాల్గొన్నారు.

ఇంటింటికీ సురక్షిత నీరు

- జల్ జీవన్ మిషన్ ప్రారంభోత్సవంలో స్పీకర్ తమ్మినేని సీతారాం



రామచంద్రాపురంలో ఇంటింటికీ తాగునీటి కుళాయిలను ప్రారంభిస్తున్న స్పీకర్ తమ్మినేని సీతారాం

ఆమదాలవలస రూరల్: గ్రామాల్లో ఇంటింటికీ సురక్షితమైన తాగునీరు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. మండలంలో రామచంద్రాపురం, పొన్నాంపేట గ్రామాల్లో రూ.90 లక్షల వ్యయంతో ఏర్పాటు చేసిన జల్ జీవన్ మిషన్ పథకం ద్వారా ఇంటింటికీ తాగునీటి కుళాయిల కార్యక్రమాన్ని శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో తాగునీటి ఎద్దడిని నివారించేందుకు నియోజకవర్గ వ్యాప్తంగా ఇంటింటికీ తాగునీటి కుళాయిలను ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. గ్రామాల్లో ఈ పనులు వేగవంతంగా జరుగుతున్నాయని వెల్లడించారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా పనిచేశామన్నారు. రోడ్లు, విద్యుత్, మురుగు కాలువలు, తాగునీటి వసతి వంటి సౌకర్యాలను కల్పించడానికి అధిక ప్రాధాన్యం ఇచ్చామన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ చల్లా ఉష, ఎంపీటీసీ కొల్లి యమున, మండల ప్రత్యేకాహ్వానితుడు తమ్మినేని శ్రీరామ్మూర్తి, జెడ్పీటీసీ సభ్యుడు బెండి గోవిందరావు, పీఏసీఎస్ అధ్యక్షుడు గురుగుబెల్లి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

రహదారి ప్రారంభం



రోడ్డును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్

నరసన్నపేట: స్థానిక మేజర్ పంచాయతీలోని మారుతీనగర్ మొదటి వీధిలో రూ.31 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డును ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ శనివారం ఉదయం ప్రారంభించారు. స్థానికులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. రోడ్డును వినియోగంలోనికి తీసుకువచ్చిన ఎమ్మెల్యేకు ఆ వీధి వాసులు అభినందించారు. స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

పొట్టి శ్రీరాములు సేవలు చిరస్మరణీయం



పొట్టి శ్రీరాములు విగ్రహానికి నివాళులర్పిస్తున్న రామకృష్ణ

ఆమదాలవలస: అమరజీవి పొట్టి శ్రీరాములు సమాజానికి, ఆంధ్ర రాష్ట్రానికి అందించిన సేవలు, అతని త్యాగాలు చిరస్మరణీయమని ఆర్య వైశ్య మహాసభ రాష్ట్ర వైస్ ప్రసిడెంట్ ఆత్మకూరి రామకృష్ణ అన్నారు. పొట్టి శ్రీరాములు జయంతి సందర్భంగా పట్టణంలోని కన్యకాపరమేశ్వరి ఆలయ ఆవరణలో గల ఆయన విగ్రహానికి శనివారం పూలమాల వేసి నివాళులర్పించారు. ఆర్యవైశ్య సంఘం నాయకులు డాక్టర్ పి.తాతయ్యలు, కె.కెస్.ప్రసాదరావు, తమ్మన రామకృష్ణరావు, పూసర్ల శ్రీనివాసరావు, బి.అప్పలరాజు, కెల్ల భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

భారీ మెజార్టీతో గెలిపించాలి



కొండవలసలో ఎన్నికల ప్రచారం చేస్తున్న చిరంజీవినాగ్

సరుబుజ్జిలి: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో స్పీకర్ తమ్మినేని సీతారాంను ఆమదాలవలస ఎమ్మెల్యేగా భారీ మెజార్టీతో గెలిపించాలని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యువజన విభాగం ప్రధాన కార్యదర్శి తమ్మినేని చిరంజీవినాగ్ కోరారు. మండలంలోని కొండవలసలో శనివారం ఎన్నికల ప్రచారం చేపట్టారు. ముందుగా గ్రామంలో పలు దేవాలయాల్లో పూజలు చేశారు. తదుపరి ప్రతీ ఇంటికి వెళ్లి ఫ్యాన్ గుర్తుపై ఓటువేసి వైఎస్సార్‌సీపీ విజయానికి తోడ్పాటు అందించాలన్నారు. ఈ ప్రచారంలో మండల పరిషత్ ప్రత్యేకాహ్వానితుడు కిల్లి వెంకటగోపాలసత్యనారాయణ, జెడ్పీటీసీ సభ్యుడు సురవరపు నాగేశ్వరరావు, వైస్ ఎంపీపీలు శివానందమూర్తి, అనిల్‌కుమార్, పార్టీ కన్వీనర్ బెవర మల్లేశ్వరరావు, కొత్తకోట పీఏసీఎస్ చైర్మన్ కొవిలాపు చంద్రశేఖర్, జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు మూడడ్ల రమణ, స్థానిక సర్పంచ్ లావేటి విశ్వేశ్వరరావు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీకి మద్దతుగా నిలవాలి



కొత్తూరు: కరపత్రాలను అందజేస్తున్న నాయకులు

కొత్తూరు: మే నెలలో జరుగునున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీకి ప్రజలు అండగా నిలవాలని పార్టీ మండల కన్వీనర్ సారిపల్లి ప్రసాదరావు, పార్టీ జిల్లా కార్యదర్శి బూర్లె శ్రీనివాసరావు కోరారు. మహార్తాపురంలో శనివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఈ ఐదేళ్లల్లో ప్రతీ కుటుంబానికి అందించిన సంక్షేమ పథకాలను తెలిపే కరపత్రాలను ఇంటింటికీ వెళ్లి అందజేశారు. మహార్తాపురం సర్పంచ్ నాస బాలకృష్ణ, గ్రామ సచివాలయం మండల కన్వీనర్ గండివలస ఆనందరావు, పార్టీ నాయకులు వనుము లక్ష్మీనారాయణ, రవి, బొడ్డేపల్లి రామకృష్ణ, తిర్లంగి కృష్ణమోహన్‌రావు పసుపురెడ్డి అశోక్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వైఎసస్సార్‌సీపీ విజయమే లక్ష్యం..

హిరమండలం: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో గృహసారథులు, కన్వీనర్లు, బూత్ కమిటీ కన్వీనర్లందరూ కలిసి వైఎస్సార్‌సీపీ విజయానికి కృషిచేయాలని పార్టీ మండల అధ్యక్షుడు మీసాల వెంకటరామకృష్ణ, పీఏసీఎస్ అధ్యక్షుడు ఏవీ సురేష్ అన్నారు. పాతపట్నం నియోజకవర్గం వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా రెడ్డి శాంతి పేరును ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రకటించడంపై వారు హర్షం వ్యక్తం చేశారు. శనివారం హిరమండలం మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాన్ని మళ్లీ గెలిపించాలని పిలుపునిచ్చారు. పార్టీ నాయకులు వెలమల బాలరాజు, సైలాడ పాపారావు, కృష్ణ, ఎం.శ్యామ్, పి.తేజేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

బూర్జ: మండలంలోని అన్నంపేట గ్రామానికి చెందిన బాలి వెంకటరమణ (44) రాగోలు జెమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శనివారం సాయంత్రం మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు. బుధవారం సెప్టిక్ ట్యాంక్ పలక విరిగిపడి తండ్రీకొడుకులు వెంకటరమణ, వెంకటనాయుడు గాయపడిన విషయం తెలిసిందే. తండ్రి వెంకటనాయుడుకు కాలు విరిగి రాగోలు జెమ్స్‌లో వైద్యం పొందుతున్నాడు. కొడుకు మృతితో గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి. మృతుడుకి భార్య చిన్నమ్మడు, ఇద్దరు ఆడ పిల్లలు ఉన్నారు.

యువతి అదృశ్యం

సారవకోట: మండలంలోని మహాశింగి పంచాయతీ కొత్తపేట గ్రామానికి చెందిన యువతి శుక్రవారం నుంచి కనిపించడం లేదని ఆమె తండ్రి శనివారం స్థానిక పోలీస్ స్టేషన్లో పిర్యాదు చేశాడు. తమ కుమార్తె శుక్రవారం ఉదయం ఇంటి నుంచి బయటకు వెళ్తానని చెప్పి తిరిగి రాలేదని తండ్రి అన్నారు. వచ్చే నెలలో వివాహం చేసేందుకు ముహూర్తం తీసినట్లు తండ్రి తెలిపారు. ఈ మేరకు ఎస్ఐ అప్పారావు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల అందజేత



సీఎం రిలీఫ్ పండ్ చెక్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే రెడ్డి శాంతి

హిరమండలం: పాతపట్నం నియోజకవర్గానికి చెందిన ఐదుగురికి మంజూరైన రూ.7.2 లక్షల చెక్కులను ఎమ్మెల్యే రెడ్డి శాంతి పాతపట్నంలోని తన క్యాంప్ కార్యాలయంలో శనివారం ఉదయం అందజేశారు. హిరమండలం మండలానికి చెందిన ఎం.లహరికి రూ.90వేలు, జగన్నాథపురం గ్రామానికి చెందిన ఎల్.మీనాకు రూ.30వేలు, కొత్తూరు మండలం కుంటిభద్రకు చెందిన కె.త్రినాథరావు కుటుంబానికి రూ.3లక్షలు, పాతపట్నం మండలం తెంబూరు గ్రామానికి చెందిన ఎం.కాంతమ్మకు రూ.1.60లక్షలు, బోరుభద్ర గ్రామానికి చెందిన రూ.1.40 లక్షల చెక్కులను ఆయా కుటుంబ సభ్యులకు అందజేశారు. వైఎస్సార్‌సీపీ నాయకులు మీసాల రామకృష్ణ, ఏవీ సురేష్, తొత్తడి మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సచివాలయ వ్యవస్థ దేశానికే ఆదర్శం

- ఎమ్మెల్యే రెడ్డి శాంతి



మద్దుమర్రి గ్రామ సచివాలయాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రెడ్డి శాంతి

పాతపట్నం: సచివాలయ వ్యవస్థ దేశానికే ఆదర్శమని పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి అన్నారు. మండలంలోని బడ్డుమర్రిలో ఉపాధి నిధులు రూ.40లక్షలతో గ్రామ సచివాలయం ఎమ్మెల్యే ప్రారంభించారు. లాబర గ్రామంలో రూ.10 లక్షలతో గిరిజన కార్పొరేషన్ డీపో (జీసీసీ డిపో)నిర్మాణానికి, రూ.10లక్షలతో ప్రయాణీకులకు విశ్రాంతి భవనం నిర్మాణానికి ఎమ్మెల్యే భూమిపూజ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ దొర సావిత్రమ్మ, చీకటి పద్మరాజు, కాంతరావు, మన్మథరావు, శ్రీధర్, భాస్కర్, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.





వైఎస్సార్‌సీపీ శ్రేణుల్లో ఆనందం



నరసన్నపేట: మహిళలకు అభివాదం చేస్తున్న ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్




పాతపట్నం: పార్టీ నాయకులతో ఎమ్మెల్యే రెడ్డి శాంతి

నరసన్నపేట: నరసన్నపేట నియోజకవర్గం నుంచి ఆరోసారి సార్వత్రిక ఎన్నికల్లో పోటీకి ధర్మాన కృష్ణదాస్ సిద్ధమయ్యారు. వైఎస్సార్‌సీపీ ఈయనకు నరసన్నపేట ఎమ్మెల్యే టికెట్ ఇస్తున్నట్లు ప్రకటించడంతో పార్టీ శ్రేణులు బాణ సంచా కాల్చారు. నరసన్నపేటలోని పార్టీ కార్యాలయంలో సందడి మొదలైంది. పార్టీ నాయకులందరూ ఎమ్మెల్యేని అభినందించారు. అనంతరం కార్యాలయం నుంచి వైఎస్సార్ కూడలి వరకు ర్యాలీగా వచ్చి వైఎస్సార్ విగ్రహానికి ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ నివాళులర్పించారు. మారుతీనగర్ మొదటి వీధిలో ఎన్నికల ప్రచారం చేపట్టారు. పోలాకి జెడ్పీటీసీ ధర్మాన కృష్ణచైతన్య, ఎంపీపీ ఆరంగి మురళి, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు చింతు రామారావు, నరసన్నపేట సర్పంచ్ బూరల్లి శంకర్, పార్టీ నాయకులు ముద్దాడ బైరాగినాయుడు, గుప్త, చీపురు కృష్ణ, పొన్నాన దాలినాయుడు, సదాశివుని కృష్ణ, రాజాపు అప్పన్న, సురంగి నర్సింగరావు, పాగోటి రాజారావు, రఘుపాత్రుని శ్రీధర్, రమణ సాహు తదితరులు పాల్గొన్నారు.

పాతపట్నంలో..

పాతపట్నం: పాతపట్నం వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా రెడ్డి శాంతికి టికెట్ రావడంతో స్థానిక ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం వద్ద శనివారం నాయకులు, కార్యకర్తలు సంబరాలు చేసుకున్నారు. బాణసంచా కాల్చారు. ఎమ్మెల్యేకు నాయకులు, కార్యకర్తలు అభినందనలు తెలిపారు.



నరసన్నపేట: పార్టీ కార్యాలయం వద్ద బాణ సంచా కాల్చుతున్న పార్టీ శ్రేణులు